
కథ

# అదృష్టం

• పేరేపు లక్ష్మి



"ఇంతకీ మీ వాడేం చదువుతాట్ట?" అంత పెళ్లి సందట్లోనూ ఖంగుమంది వర్ధనమ్మగారి గొంతు.

ముందు నన్ను కాదన్నట్లు తప్పించుకోబోయాను. కాని, మళ్లీ, "మిమ్మల్నే, జయమ్మగారూ, మీ వాడేం చదువుతాట్ట?" అని వర్ధనమ్మగారు నావైపే తిరిగి తరచి తరచి అడగడంతో అందరి దృష్టీ నామీదకి మళ్లింది.

నేను ఏం సమాధానం చెప్పాలా అని ఆలోచించుకుంటూండంగానే ప్రక్కనున్న అన్నపూర్ణమ్మగారు వకాల్తా పుచ్చుకున్నట్లు అంది "ఇంకేముంది...ఇంజనీరో, డాక్టరో!"

ఆ రెండూతప్ప మరొక చదువు చదువు కాదన్నట్లు ఖచ్చితంగా చెప్పింది. నా గొంతులో వచ్చి వెలక్కాయ పడ్డట్లయింది. చెప్తేగాని విడిచి పెట్టనన్నట్లు వర్ధనమ్మగారు నా మీద నుంచి దృష్టి మళ్లించలేదు. తప్పదన్నట్లు నోరు విప్పాను.

"ఇంకా ఒక నిర్ణయానికి రాలేదండీ... రిజల్ట్ వచ్చాక ఆలోచిస్తాం..."

"రేపేగా టెన్త్ రిజల్ట్స్! మావాడి నప్పుడే గుంటూరు విజ్ఞాన్‌లో జాయిన్ చేశాం... ఎమ్‌సెట్ అంటే మాటలా? ఈ రెండేళ్లూ కష్టపడొద్దూ?" మెడలో నగలు సవరించుకుంటూ నావైపు చూసింది వర్ధనమ్మగారు.

నేను మౌనం వహించాను. కారణం ఇంచుమించుగా నెలరోజులుగా మా ఇంట్లో ఇదే అంశం మీద ఘాటుగా చర్చలు జరుగుతున్నాయి. మా కున్నది ఇద్దరే...భార్గవ్, పద్మ. పద్మ ఇంకా సెవెన్త్ క్లాస్. అయినా ఆడపిల్ల ఎప్పటికైనా పెళ్లి చేసి అత్తవారింటికి పంపించాల్సిందే. అందువల్ల పద్మ చదువు విషయంలో పెద్దగా ఆశలు పెట్టుకోలేదు. కాని, భార్గవ్... ఒక్కగానొక్క కొడుకు... డాక్టరో, ఇంజనీరో చదివితే బాగుండునని నా కోరిక.

నా కోరికను ఎన్నోసార్లు మా వారిముందు బయటపెట్టాను. తను పెద్దగా పట్టించుకోలేదు. తేలిగ్గా కొట్టిపారేశారు. "టెన్త్ అవనీ...వాడి నిర్ణయం వాడే తీసుకుంటాడు" అనేవారు.

భార్గవ్ టెన్త్‌లోకి వచ్చిన తర్వాతకూడా ఎన్నోసార్లు ఈ విషయం కదిపి చూశాను ఇద్దరి దగ్గరా. హఠాత్తుగా ఒకరోజు రాత్రి భోజనాల దగ్గర భార్గవ్ అన్నాడు: "నాన్నగారూ! నాకు టీచింగ్ ప్రొఫెషన్‌లోకి వెళ్లాలనుంది" అని.

ఒక్కక్షణం నేను స్థాణువులా నిలబడి పోయాను. భార్గవ్ ఒక స్కూల్ టీచర్ అనే ఆలోచన నా మనస్సు జీర్ణించుకోలేక పోయింది. రోజూ పేపర్లలో కోచింగ్ సెంటర్‌ల అడ్వర్టైజ్‌మెంట్ల ఫలితమో, ర్యాంకుల గోల ఫలితమో నా మనసులో భార్గవ్‌ని ఒక ఇంజనీరుగానో, డాక్టరుగానో చూడాలన్న కోరిక తిష్ఠవేసుకుని కూర్చుంది. ఇప్పుడు భార్గవ్ నోటంట వాడి కోరిక విన్నాక నేను నిలువునా నీరు కారిపోయాను.

టెన్త్ పరీక్షలయ్యాక నచ్చచెప్పి చూడాలనుకున్నాను. ఈ పెళ్లికి రావడం, వర్ధనమ్మగారు నలుగురిలో నన్ను నిలదీసినట్లు అడగడం...ఏం చెప్పాలో తోచక కొంగు వేలికి ముడివేస్తూ కూర్చున్నాను.

"జయమ్మగా రప్పుడే వాళ్లబ్బాయి డాక్టరో, ఇంజనీరో అయిపోయినట్లు కలలు కంటున్నారు కాబోలు!" పక్కను న్నావిడ హాస్యమాడింది.

హాస్యంకంటే అందులో నాకు అపహాస్యం ఎక్కువ ఉందనిపించింది. మనసు చివుక్కుమంది. లేచి 'వస్తానని' చెప్పి ఇంటికి వచ్చేశాను.

000

రాత్రి భార్గవ్ డాబామీద ఒంటరిగా ఉన్నాడని తెలిసి వెళ్లాను.

"నీతో కొంచెం మాట్లాడాలి, భార్గవ్!" అన్నాను.

"నాకు తెలుసునమ్మా, నా చదువు గురించే కదా...రా కూర్చో" అన్నాడు.

వాడి పక్కనే కూర్చుని భుజంమీద చేయి వేశాను ఆప్యాయంగా...దుఃఖం పెల్లుబికింది.

"భార్గవ్! నీ నిర్ణయంలో మార్పు లేదా?"

"....." తలదించుకుని దీర్ఘంగా ఆలోచిస్తున్నాడు.

నాలో ఏ మూలో చిన్న ఆశ! "నువ్వు ఏ చదువు చదివినా నాన్నగారు చదివించడానికి సిద్ధంగా ఉన్నారురా...మా అబ్బాయి డాక్టరు, ఇంజనీరు అంటే మాకెంత గర్వంగా, గౌరవంగా ఉంటుంది చెప్పు?"

ఒక్క క్షణం నావైపు తేరిపార చూసి అన్నాడు: "నేను టీచర్‌నైతే, లెక్చరర్‌నైతే నీకు నలుగురిలో నామోషియా, అమ్మా? ఆసక్తి లేని విద్య నార్జించడానికి వృథా ప్రయత్నమెందుకు చెప్పు? వృత్తి ఏదైనా చేపట్టిన వృత్తికి న్యాయం చేకూర్చా లన్నది నా అభిమతం. అందులోనే అంచెలంచెలుగా ఎదిగి పేరు తెచ్చుకునేందుకు ప్రయత్నిస్తాను. అనవసరంగా మనసు పాడు చేసుకోక సమాధానపడు..."

వాడి ప్రతీ మాటలోనూ నగ్నసత్యం ఉందని తెలిసినా, నా మనస్సు సమాధానపడలేక పోతోంది. చివరికి ఏం చేయలేక 'వాడి నుదుటన అంతే రాసిపెట్టి ఉం'దని సరిపెట్టుకున్నాను.

0 0 0

కాలచక్రం గిర్రున తిరిగింది.

భార్గవ్ ఎమ్.ఎ.లో గోల్డ్ మెడల్

## ఈశ కూడా ఏమీ తీసిపోలేదు!

'కంపెనీ' చిత్రంతో కాస్త పేరు సంపాదించుకున్నది ఈశాకొప్పికర్. బాలీవుడ్‌లో కెరీర్ సరిగ్గా ఏర్పడకముందే ఇంద్రకుమార్‌తో ప్రేమాయణం నడిపింది. ఇప్పుడు ఈశకు సినిమాల్లో అవకాశాలొస్తున్నాయి కనుక మళ్లీ ఇంద్రకుమార్ ఆమె దగ్గరికి చేరుతున్నాట్ట. అదేమీ నిజం కాదంటోంది ఈశ. ఇప్పుడు 'పింజర్' హీరో ప్రియాంశు ఛటర్జీతో సరదాగా కాలం గడుపుతోందంటున్నారు. దాన్ని కూడా ఖండిస్తూ ఈశ, "చిత్రం షూటింగులప్పుడు ప్రియాంశు, 'అదేమిటి సార్, ఇంతందమైన చెల్లెల్ని నాకు తోడుగా పుంచితే ఎలాగండీ? నేను కాస్త బాలెన్స్‌డ్‌గా నటించనక్కర్లేదా?' అని దర్శకుడితో అనేశాట్ట. 'పింజర్'లో నేనతనికి సోదరిగా నటిస్తున్నా లెండి. అతనన్న మాటను నాకు కాంప్లిమెంట్. అంతే కానీ మా ఇద్దరి మధ్యా ఇంకేమీ లేదు" అంటూంది ఈశ. ప్రస్తుతం తను నటించిన ఆరు చిత్రాలు విడుదల కోసం ఎంతో ఇదిగా ఎదురుచూస్తోంది ఈశ.

ఎన్.



సంపాదించాడు. ఈ మధ్యకాలంలో బంధువులలో, స్నేహితులలో ఎంతోమంది పిల్లలు డాక్టర్లు, ఇంజనీర్లు అవడానికి ఎమ్‌సెట్ రాసి మంచి ర్యాంకులు సంపాదించి, సీట్లు తెచ్చుకున్నారు. నా మనసులో మాత్రం ఏ మూలో 'నా కొడుకు అందరిలా డాక్టరు, ఇంజనీరు చదవలే'దని ముల్లులా గుచ్చు కుంటూనే ఉంది.

పద్మది బి.యస్‌సి. పూర్తయింది. పెళ్లి సంబంధాలు వేట ప్రారంభమైంది. భార్గవ్‌కి కూడా మంచి కాలేజీలో లెక్చరర్‌గా ఉద్యోగం రావడంతో అంతా కలిసి హైదరాబాద్‌లోనే సెటిల్ అయ్యాము.

గతం మర్చిపోయి వర్తమానంతో రాజీ పడుతున్న సమయంలో ఒకరోజు హఠాత్తుగా భార్గవ్ తనవెంట ఎవరో ఫ్రెండ్‌ని తీసుకువచ్చాడు.

నాకు పరిచయం చేస్తూ "అమ్మా, గుర్తుపట్టావా? రాకేష్....వర్ధనమ్మగారి అబ్బాయి. ఇంజనీరింగ్ చదువుతున్నాడు... అనుకోకుండా రెస్టారెంట్‌లో కలిస్తే ఇలా తీసుకొచ్చాను."

మానిన నా గాయం రేగినట్లయింది. జీడిపప్పు ఉప్మా చేసిపెట్టి, కాఫీ ఇచ్చాను. వెళ్లిపోతున్నప్పుడు అప్రయత్నంగానే నా నోటివెంట "మీ అమ్మగారు చాలా అదృష్టవంతులు" అన్న మాటలు వెలువడ్డాయి.

నా మాటలలోని వ్యంగ్యం సూటిగా భార్గవ్ గుండెను తాకిందేమో క్షణంలో సగభాగం నావైపు చూసి ముఖం తిప్పుకున్నాడు.

వాడి మనసుగాని కష్టపెట్టానా అనిపించింది. కాని, ఏం చెయ్యను? నాలో అంతర్లీనంగా ఉన్న కోరికను అణచివేసేసరికి అది నా మాటలలో బహిర్గతమైంది.

'నువ్వు ఆమాట అనకుండా వుండాల్సింది.' మా వారు అన్నారు. పిహెచ్.డి. పూర్తి చేసి డాక్టరేట్ పట్టా పొందిన చెట్టంత కొడుకుని అవమానించానా అని నేనుకూడా లోలోపల బాధపడ్డా పైకి గంభీరంగా ఉండిపోయాను.

000

"పోస్ట్!" కేక విని పద్మ పరుగెత్తింది. కవరు విప్పి చదివిన పద్మ సంతోషంతో ఉక్కిరిబిక్కిరౌతూ--"అమ్మా! ఈ యేడు 'నేషనల్ అవార్డ్'కి అన్నయ్యని ఎంపిక చేశారమ్మా. వచ్చే నెలలో ఢిల్లీలో అవార్డు ఇస్తారుట. అమ్మా! నేనుకూడా అన్నయ్యతో ఆ ఫంక్షన్‌కి వెళ్తానమ్మా."

అంత మంచి శుభవార్త చెప్పినందుకు ముందురోజు చేసిన సున్నివుండ పద్మ నోట్లో కుక్కాను. ఎదురుగా ఉన్న ఏడుకొండలవాడి ఫొటో చూసి రెండుచేతులూ జోడించాను.

ఇంతలో ఇంటికొచ్చిన భార్గవ్, వాళ్ల నాన్నగారు ఇద్దరూకూడా మా సంతోషంలో పాలు పంచుకున్నారు.

భోజనాలు దగ్గర కొంచెం ముభావంగా కెలుకుతున్న భార్గవ్‌ని చూసి "అదేంటిరా... అదోలాగున్నావ్...ఒంట్లో బాగులేదా?" అన్నాను. వాడేం మాట్లాడకుండా రెండు ముద్దలు తిన్నాననిపించి, చెయ్యి కడుక్కుని వెళ్లిపోయాడు.

వాడి వెనకాలే గదిలోకి వెళ్లాను. కుడిచెయ్యి కళ్లమీద పెట్టుకుని మంచంమీద వాలిపోయాడు.

పక్కనే కూర్చుని నుదుటిమీద చెయ్యి వేశాను. "భార్గవ్! ఇంట్లో అందరూ సరదాగా ఉన్నప్పుడు నువ్వు....?"

"నా మనస్సు బాగోలేదమ్మా?" ముక్తసరిగా అన్నాడు.

"ఏమైందిరా చెప్పు...." అని రెండు మూడుసార్లు రెట్టించాక నోరు విప్పాడు.

"రాకేష్ ఆత్మహత్య చేసుకున్నాడమ్మా... వారమైందిట. నా కీ రోజే తెలిసింది."

నా నెత్తిన పిడుగు పడ్డట్టయింది. "రా... కే... ష్... ఆ... త్మ... హ... త్య...?" అలా చేష్టలుడిగి కూర్చుండిపోయాను.

భార్గవే మళ్లీ అన్నాడు. "ఆ మధ్య నాకొక ఉత్తరం రాశాడు...అందులో మానసిక ఒత్తిడికి గురవుతున్నట్లుగా రాశాడు. అసలు ముందు నుంచీ ఇంజనీరింగ్ చదవడం తనకిష్టం లేదుట. వాళ్ల అమ్మగారి మాట కాదనలేక, పోరుపడలేక ఎమ్‌సెట్ రాశాడట. అందులో మంచి రాంకు రాకపోయినా డొనేషన్లు కట్టి ఇంజనీరింగ్‌లో జాయిన్ చేశారట. వాడి కేమాత్రం ఆసక్తి లేని ఆ చదువులో రాణించలేకపోయాడు. వరుసగా రెండేళ్లు పరీక్ష తప్పాడు. అటు ఇష్టంలేని చదువు, ఇటు ఇంట్లో వాళ్ల ఒత్తిడి--రెండింటికీ మధ్య నలిగిపోయాడు. తనకెంతో ఇష్టమైన ఆర్ట్ అండ్ పెయింటింగ్‌కి దూరమైనందుకు బాధపడ్డాడు. చివరికెలాగో ఏడెనిమిదేళ్లకి ఇంజనీర్ ననిపించుకున్నా వాడికొచ్చిన మార్కులకి ఎక్కడా మంచి ఉద్యోగం రాలేదు. వాళ్ల నాన్నగారు వాళ్ల కాళ్లు, వీళ్ల కాళ్లు పట్టుకుని అయిదువేలు జీతానికేదో ఉద్యోగం వేయిస్తే, వీడు చేసిన అవకతవక పనులకి సస్పెండ్ చేశారుట...ఆ అవమానం భరించలేక ఇంట్లో తల్లిదండ్రుల ముందు తలెత్తుకోలేక ఈ పని చేశాట్ట!"

నా కళ్లనిండా గిర్రున నీళ్లు తిరిగాయి. ఉన్న ఒక్క కొడుకు మిగిల్చిన శోకానికి వర్ధనమ్మగారి పరిస్థితి తలచుకుంటేనే భయంగా ఉంది.

ఏడుకొండలవాడి ఫొటో దగ్గరకి వెళ్లి నించున్నాను. నా కళ్లు వర్షిస్తూనే ఉన్నాయి.

'నేను అదృష్టవంతురాలిని'...గుండెమీద చేయి వేసుకుని మొదటిసారిగా మనస్ఫూర్తిగా ఏ దాపరికం లేకుండా అనుకున్నాను.

నా కన్నీటి పొరల మధ్య ఫొటో పక్కనే ఫ్రేములో వేళ్లాడుతున్న భార్గవ్ గోల్డ్ మెడల్ తళుక్కున మెరిసింది.

■

